# వైద్య సీట్ల అనుమతులకు ప్రత్యేక వ్యవస్థ

- ఎంసీఐ పరిధి కుదింపు
- సిలబస్, బోధనాతీరు నిర్ణయానికే పరిమితం
- కేంద్ర ప్రభుత్వం సుముఖత
- 2011-12 విద్యాసంవత్సరం నుంచి అమలుకు యత్నం!

విజయవాడ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎంసీఐ అధ్యక్షుడు కేతన్‌దేశాయ్ అవినీతి నేపథ్యంలో ఎంసీఐ అధికారాల పరిధి కుదించేందుకు రంగం సిద్ధం అవుతోంది. ఇప్పటికే కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి గులాం నబీ ఆజాద్ నేతృత్వంలో సమావేశం జరిగింది. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ సిఫార్సులపై ఎంసీఐతో పాటు ఇతర ఆరోగ్య విశ్వవిద్యాలయాల నుంచి అభిప్రాయాలు వెల్లాయి. ఉన్నతవిద్యను అంతటికీ ఒకే పరిపాలనా గొడుగు పరిధిలోకి తేవాలని భావించినా వైద్యవిద్యలాంటి కోర్సులకు, ఇతర కోర్సులకు తేడా ఉందన్న అభిప్రాయం రావడంతో కొన్ని సడలింపులు ఇచ్చి ఎంసీఐ (భారతీయ వైద్య మండలి) అధికారాలను కుదించనున్నారు. త్వరలో ఈ నిర్ణయం ప్రకటించనున్నట్లు సమాచారం.

కుదింపు ఇలా..: ప్రస్తుతం వైద్య కళాశాలలకు అనుమతి, పరీక్షల విధానం, వైద్యుల ప్రవర్తన, నియమావళి, సౌకర్యాలపై పర్యవేక్షణ, బోధనా పద్ధతులు తదితర 14 అంశాలు ఎంసీఐ పరిధిలో ఉన్నాయి. కొత్తగా తీసుకునే నిర్ణయం ప్రకారం బోధనా విధానం, నాణ్యత, పరీక్షల విధానానికే పరిమితం కానుంది. కళాశాలల అనుమతులు, సౌకర్యాల పరిశీలనకు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్) లేదా, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ విభాగంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ కార్డుల విధానాన్ని అభివృద్ధి చేసి వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేసేందుకు ఇప్పటికే కేంద్రం సూచనాప్రాయంగా ఆరోగ్యశాఖకు అనుమతిచ్చింది. ఇప్పటికే కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖపరిధిలో పనిచేసే వ్యవస్థలా ఎంసీఐని మార్చాలని ప్రతిపాదనలు వచ్చినా అధికారాలు, పరిధిని కుదించేందుకే కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎంసీఐలో మొత్తం 150 మంది కమిటీలో ఉన్నారు. వీరిలో రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సుమేరకు కేంద్ర నామినేట్ చేసినవారిలో 15 మందిని, విశ్వవిద్యాలయాల చేత ఎంపికైన 40 మందితోపాటు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి హోదాకల్గిన వ్యక్తి అధ్యక్షుడిగా ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు కానుంది. ఈ విధానం అమలైతే ఎంసీఐ కేవలం బోధనా విధానాల సూచనలకు, బోధనలో నాణ్యత పరిరక్షణకే పరిమితం కానుంది.

# సూపర్ స్పెషాలిటీకీ తప్పనిసరి నిబంధన

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడేళ్లు చేయాల్సిందే

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పీజీ వైద్యవిద్య విద్యార్థులను ఏడాదిపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించాలని నిబంధన పెట్టిన తరహాల్లోనే సూపర్‌స్పెషాలిటీ కోర్సులు పూర్తిచేసిన వారికీ కనీసం మూడేళ్ల సేవా నిబంధన పెట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే వర్సిటీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. కనీసం మూడేళ్లపాటు పనిచేస్తామని చెబుతూ గ్యారెంటీగా నాన్‌జ్యూడిషియల్ బాండ్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ విద్యాసంవత్సరానికి అమలుచేసే సమయం లేనందున వచ్చే విద్యాసంవత్సరం (2011-12) నుంచి అమలుచేయనున్నారు.

రూ.300 కోట్ల బాండ్లు: పీజీ వైద్య విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం ఏడాదిపాటు పనిచేస్తామని చెబుతూ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పీజీ వైద్య విద్యార్థులంతా కలిసి రూ.300 కోట్ల విలువైన బాండ్లు ఇవ్వాల్సి ఉంది. మరోవైపు దాదాపు 3 వేల మందికి పైగా గజిటెడ్ అధికారుల సంతకం పెట్టాల్సి ఉంది. పీజీ విద్యార్థులు రూ.20 లక్షలు, డిప్లొమా విద్యార్థులు రూ.15 లక్షలకు క్లినికల్, నాన్ క్లినికల్ విద్యార్థులంతా వివిధ మొత్తాలకు బాండ్లు రాసివ్వాల్సి ఉంటుంది.

# పీఎస్ఎల్‌వీ-సీ15 ప్రయోగం వాయిదా

చెన్నై: పీఎస్ఎల్‌వీ-సీ15 ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాయిదా వేసింది. ఈమేరకు సంస్థ గురువారం ఇక్కడ ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపగ్రహ వాహక నౌకను మే 9న ప్రయోగించనున్నట్లు ఇస్రో తొలుత ప్రకటించింది. పీఎస్ఎల్‌వీని పరీక్షిస్తున్న సమయంలో చిన్నపాటి లోపాలను గుర్తించామని, అందుకే వాయిదా నిర్ణయం తీసుకొన్నామని తెలిపింది. కొత్త ప్రయోగ తేదీను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. పీఎస్ఎల్‌వీ-సీ15.. కార్టోశాట్-2బీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టనుంది.

03-04-2010 Eenadu